సాక్షి సిద్దిపేట

శుక్రవారం ⁝ 5 ⁝ ఏప్రిల్ ⁝ 2024

6న జెడ్పీ సమావేశం

సిద్దిపేటజోన్: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 6న జరుగుతుందని జెడ్పీ సీఈఓ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.



న్యూస్‌రీల్

నామినేషన్‌లో ఆస్తి వివరాలు తప్పనిసరి

హుస్నాబాద్: ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్‌లో ఆస్తి వివరాలు తప్పనిసరిగా తెలపాలని ఆర్డీఓ రామ్మూర్తి సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆర్డీఓ రామ్మూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో నామినేషన్ వేసే అభ్యర్థులు వారి వారి ఆస్తుల వివరాలు, ఐటీ రిటర్న్స్‌తో సహ పూర్తి వివరాలతో కూడిన జీరాక్స్ ప్రతులను జత చేయాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే ర్యాలీలు, సభల అనుమతుల కోసం ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పై విచారణ జరిపి అనుమతి ఇస్తారని తెలిపారు. ప్రతి వాహనానికి అనుమతి తప్పనిసరి అని ఆర్డీఓ తెలిపారు.

బ్రహ్మాండనాయకుడికి లక్ష తులసీదళార్చన



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలోని వేంకటేశ్వరాలయంలో గురువారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు తెల్లవారుజామున స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి లక్ష తులసీదళార్చన చేశారు. నేత్రపర్వంగా సాగిన మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించారు. కొండపైన సరస్వతి అమ్మవారిని, ఉప ఆలయాలలో దేవతామూర్తులను దర్శించుకున్నారు.

భక్తుల ఇంటికే రాములోరి తలంబ్రాలు

గజ్వేల్‌రూరల్: భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలు భక్తుల ఇంటికి చేర్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టిందని మెదక్ రీజియన్ కార్గో ఏటీఎం దేవేందర్ రెడ్డి గురువారం పేర్కొన్నారు. దేవాదాయ శాఖ సహకారంతో ఈ పవిత్రమైన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తలంబ్రాలు కోరుకునే భక్తులు జీపీపీ (గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రంలో రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

నిరంతరం విద్యుత్ సరఫరా

- విద్యుత్ శాఖ ఎస్ఈ మోహన్ రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వేసవికాలంలోనూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. గత ఏడాది మార్చి నెలలో 319 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈఏడాది మార్చి నెలలో 359 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందన్నారు. వాతావరణం దృష్ట్యా విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే సిద్దిపేట్ డివిజన్ కార్యాలయం (83339 24847), గజ్వేల్ డివిజన్ కార్యాలయం (94904 92078), హుస్నాబాద్ డివిజన్ కార్యాలయం (79016 79075), సిద్దిపేట జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 73829 43931కు తెలియజేయాలని సూచించారు.

'ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాల్సిందే'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెన్త్ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ చర్యలు తీసుకోకుండా కేవలం మెమో జారీ చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి ఉపాధ్యాయులపై పోలీస్ కమిషనర్ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని కోరారు.

పానీపాట్లు!



రోజురోజుకూ ఎండలు మండిపోతున్న తరుణంలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో ప్రజలకు నీటి గోస తప్పడం లేదు. ఇంటింటికీ వచ్చే మిషన్ భగీరథ నీళ్లు సైతం రోజు తప్పి రోజు వస్తున్నాయి. కొన్ని చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తారు. కొందరు మహిళలు వేరే ప్రాంతానికి వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఏర్పడిన తాగు నీటి కొరతపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

వివరాలు 8లో ▸

గరుడోత్సవ వైభవం


- భక్తజన పునీతం
- నాచగిరిలో భక్తిపారవశ్యం

వర్గల్(గజ్వేల్): నాచగిరి బ్రహ్మోత్సవ సిరితో అలరారుతున్నది. గురువారం రాత్రి లక్ష్మీనృసింహుని గరుడోత్సవసేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ అన్నపూర్ణ ఉత్సవ వేడుకల్లో పాల్గొని పర్యవేక్షించారు. అర్చకులు మొదట విష్ణుమూర్తి ప్రతినిధి, వేద స్వరూపుడైన గరుత్మంతుడిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలమాలికలతో కమనీయంగా అలంకరించారు. విశేషపూజలు చేశారు. నవదంపతులైన శ్రీలక్ష్మీ నారసింహులకు దంపతి సేవ, సదస్యం నిర్వహించి గరుడాళ్వారుకు గరుడ బలి నిర్వహించారు. అనంతరం లక్ష్మీసమేత స్వామివారు గరుడ వాహనంపై పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నేత్రపర్వంగా సాగిన గరుడోత్సవ సేవలో భక్తులు పాల్గొని తరించారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనృసింహస్వామివారు

కరువునేలపై గోదారమ్మ అడుగిడింది. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చెరువులు, కుంటలకు నీళ్లు వదిలారు. తుక్కాపూర్‌లోని 12వ పంపు ద్వారా మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు నీళ్లను వదలడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండుటెండలతో ఎండుతున్న పంటలకు గోదారి జలాలు జీవం పోసినట్లయింది.



గోదారి జలాలతో అప్పనపల్లి ఊరచెరువు కళకళ

కరువు నేలపై గోదావరి గలగలలు

మండుటెండల్లో జల పరవళ్లు

- కాళేశ్వరం నుంచి నీరు విడుదల
- సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో 57 చెరువులకు జలకళ
- ఎండిపోతున్న పంటలకు జీవం
- కూడవెల్లి వాగులోకి ఉధృతంగా నీరు
- సంబరపడుతున్న రైతులు

దుబ్బాక: మల్లన్నసాగర్ 12వ ప్యాకేజీ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్నారు. దుబ్బాక, తొగుట, సిద్దిపేట అర్బన్, నంగునూరు మండలాలతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని మొత్తం 57 చెరువులు, కుంటలను నింపుతున్నారు. మల్లన్నసాగర్ ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటర్ కాలువల ద్వారా నీరు వదిలారు. ఇప్పటికే తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన బొల్లక్కచెరువు, తోపుకుంట, సిద్దిపేట మండలంలోని తడ్కపల్లి, ఎన్సాన్‌పల్లి, వెంకటాపూర్, ముత్తంకుంట, ఇర్కోడు, చింతల చెరువు, తోర్నాలలోని నాగం చెరువు, దుబ్బాక మండలం అప్పనపల్లిలోని నాలుగు చెరువు కుంటలకు నీటిని వదిలారు. అలాగే బల్వంతాపూర్, రాజక్కపేటలోని పలు చెరువులకు గోదారి జలాలు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. ప్రధాన కాలువ ద్వారా తొగుట మండలంలోని ఆరు చెరువులు, సిద్దిపేట, నంగునూరు, నారాయణరావుపేట మండలాల్లో 25, దుబ్బాక మండలంలో 12, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని 14 చెరువు, కుంటలను నింపుతున్నారు.

పంటలకు జీవం..

ప్రస్తుత యాసంగిలో రికార్డు స్థాయిలో వరిపంటలు సాగుచేశారు. ఈ క్రమంలోనే మండుతున్న ఎండలతో ఒక్కసారిగా బోర్లలో నీరు తగ్గాయి. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయి. పెద్ద ఎత్తున పంటలు ఎండిపోయే ప్రమాదం నెలకొనడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిల దృష్టికి వెళ్లడంతో వారు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడంతో పాటు మంత్రులను కలిసి విన్నవించారు. ఈ క్రమంలో మల్లన్నసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో ఎండుతున్న పంటలకు గోదారి జలాలు జీవం పోసినట్లయింది. మండుటెండల్లో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతున్నాయి. రెండు రోజుల క్రితమే కూడవెల్లి వాగులోకి సైతం నీరు విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మల్లన్నసాగర్‌తో కరువు దూరం



శాశ్వతంగా రైతుల కష్టాలు దూరం చేయాలన్న సంకల్పంతోనే మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. కాళేశ్వరం అనుసంధానంతో 50 టీఎంసీల సామర్థ్యంతో మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మించారు. కొన్ని రోజులనుంచి మల్లన్న సాగర్ కాలువ ద్వారా నీటిని వదిలి చెరువులు, కుంటలు నింపుతండటంతో రైతులు సంబరపడుతున్నారు. పంటలకు జీవం వచ్చింది.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే దుబ్బాక

నీళ్లు రాకుంటే పంటలు ఎండిపోయేవి



మల్లన్న సాగర్ నుంచి కాలువల ద్వారా నీళ్లు వదలకుంటే మా పంటలు మొత్తం ఎండిపోయేవి. నీళ్లు వస్తాయన్న ఆశతోనే పంటలు వేసుకున్నాం. తీరా వరి చేలు ఈనుతున్న దశలోనే బోర్లలో నీరు తగ్గడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. కాలువల నీళ్లు రావడంతో మళ్లీ పంటలు జీవం పోసుకున్నాయి. ఇంకో 15 రోజులు నీళ్లు పెడితే పంటలు కోతకొస్తాయి.

– పాతూరి రాంరెడ్డి, రైతు దుబ్బాక

రైతుల్లో సంతోషం



మండుటెండల్లో మల్లన్నసాగర్ కాలువ ద్వారా చెరువులకు నీళ్లొదలడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. ఎండుతున్న వరిపంటలకు మళ్లీ జీవం పోసినట్లయింది. దుబ్బాక బోడోనికుంట నిండింది. అలాగే చెల్లాపూర్, మల్లాయపల్లి చెరువులతో పాటు రాజక్కపేట చెరువు నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని చెరువులకు నీళ్లు వెళ్తున్నాయి.

– సంజీవరెడ్డి, రైతు రాజక్కపేట

లక్ష్యసాధనకు ప్రణాళికతో చదవాలి

- జిల్లా కలెక్టర్ మనుచౌదరి
- గజ్వేల్‌లో పోటీ పరీక్షల శిక్షణ శిబిరం ప్రారంభం



అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్: ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్ 1, 2, 3, 4 తదితర పోటీ పరీక్షల ఫౌండేషన్ కోర్సుల ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షల ప్రిపరేషన్‌కు సిలబస్, అందుకు సంబంధించిన పుస్తకాలను ఎంచుకోవడం కీలకమని చెప్పారు. పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరంలో అభ్యర్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. మూడు నెలలపాటు ప్రణాళిక తయారు చేసుకొని సమయాన్ని వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఎన్ని గంటలు చదివినా ప్రతినిత్యం 7–8గంటలు నిద్రపోవాలన్నారు. దృఢసంకల్పంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్‌జీటీ అభ్యర్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 90 రోజుల వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సెక్టార్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించే సెక్టార్ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఎన్నికల విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాస్టర్ ట్రైనర్ అధికారి అయోధ్య రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్‌లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈవీఎం మిషన్ల డిస్ట్రిబ్యూషన్ నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసి కౌంటింగ్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూములలో భద్రపరిచే వరకు బాధ్యత వహించాలన్నారు. సెక్టర్ అధికారులు ఈవీఎం మిషన్లు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాడ్ అనుసంధానం నుంచి పూర్తిగా ముగిసే వరకు ప్రతి విషయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, డీపీఓ దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతం



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ సెషన్ -2 పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 68 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష సీబీటీ విధానంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన సెషన్‌కు 35కు 34 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించిన సెషన్‌కు 39కి 34 మంది హాజరయ్యారు. రెండు సెషన్లకు కలిపి ఆరుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ గోపాల్, టీసీఎస్ ఆఫీసర్ కుమార్, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ మహ్మద్ షాదుల్లా, డీపీ రావు పర్యవేక్షించారు.

కళల సమాహారమే ఒగ్గుడోలు

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ అవార్డు గ్రహీత చుక్క రవి



మాట్లాడుతున్న రవి

సిద్దిపేటఎడ్యుకేషన్: సాహిత్యం, సంగీతం, నాట్యం మూడింటి సమాహారమే ఒగ్గుకథ కళా ప్రదర్శన అని ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ చుక్క రవి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ, ఆటానమస్ కళాశాలలో పది రోజులపాటు నిర్వహించనున్న జాతీయ ఒగ్గుడోలు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జానపద కళారూపానికి సంబంధించి ఒగ్గుడోలు నృత్యం ఎంతోమందిని ఆకట్టుకుంటోందన్నారు. శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, కార్యశాల కన్వీనర్ డాక్టర్ మహేందర్ రెడ్డిలు మాట్లాడుతూ.. తరతరాలుగా వస్తున్న జానపద కళారూపాలు జాతి వారసత్వ సంపదగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర యస్.మహేందర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

- తాళం వేసిన 8 ఇళ్లలో చోరీ
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ



చోరీ గురించి వివరిస్తున్న బాధితురాలు

వర్గల్(గజ్వేల్): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగలు బీభత్సం సృష్టించారు. గత నెల 27న వర్గల్ మండలం గోవిందాపూర్‌పై విరుచుకుపడిన దొంగలు బుధవారం రాత్రి వేలూరు గ్రామంపై పంజా విసిరారు. గౌరారం ఎస్ఐ శివకుమార్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని చీమల నవీన్, కుమ్మరి వేణు, గడ్డం లక్ష్మణ్, మల్లెల దశరథ్, కటికెల పెంటయ్య, కటికెల భాగ్యమ్మ, చంద్రం, మల్లేశం ఇళ్ల తాళాలు ధ్వంసం చేశారు. 8 ఇళ్ల లో సుమారు 27 తులాల బంగారు, 30 తులాల వెండి, రూ.6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం చోరీ ఘటన వెలుగులోకి రాగా క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు.

విషాదం నుంచి తేరుకోకముందే..

వేలూరుకు చెందిన చీమల నర్సింహులు నాలుగు రోజుల కిందట మృతి చెందాడు. అతడి కుటుంబీకులు కొత్త ఇంటికి తాళం వేసి మూడో రోజు కర్మకాండ కోసం పాత ఇంటికొచ్చారు. దొంగలు కొత్త ఇంటి తాళాలు ధ్వంసం చేసి బీరువా నుంచి బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. ఇంటి పెద్ద మృతి విషాదం నుంచి తేరుకోకముందే చోరీ జరగడంతో కుటుంబీకులు బోరుమన్నారు. గడ్డం లక్ష్మణ్ కుటుంబీకులు పాత ఇంటికి తాళం వేసి పక్కనే కొత్తగా కట్టుకున్న ఇంట్లో నిద్రచేసేందుకు వెళ్లారు. అదే విధంగా కుమ్మరి వేణు దంపతులు, మల్లెల దశరథ్ కుటుంబీకులు, కటికెల పెంటయ్య కుటుంబీకులు తమతమ బంధువుల ఇళ్లలో వివాహ శుభకార్యం నిమిత్తం వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు చోరీలకు పాల్పడ్డారు. సీసీ కెమెరాలు పరిశీలించి, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. చోరీ జరిగిన ఇళ్ల కుటుంబీకులను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. రూ.5,000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

పరిధి దాటి ట్రీట్‌మెంట్ చేస్తే చర్యలు

- ఆర్ఎంపీ, పీఎంపీలకు డీఎంహెచ్ఓ హెచ్చరిక
- సొంత ఊరిలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ పరిధి దాటి వైద్య చికిత్స చేయకూడదని, చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పుట్టి పెరిగింది, విద్యాభ్యాసం చేసింది సిద్దిపేటలోనేనని, ఎంబీబీఎస్ తర్వాత తన మొట్ట మొదటి ప్రాక్టీస్ సిద్దిపేటలో చేశానని అన్నారు. స్థానికంగా సిద్దిపేటలో వైద్యారోగ్యశాఖ అధికారిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని అన్నారు. అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. అలాగే ఆస్పత్రుల నిర్వహణకు తప్పనిసరిగా వైద్యారోగ్యశాఖ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల సిబ్బంది సమయ పాలన పాటించాలని అన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలకు తీసుకునే చార్జీలు తెలిపే పట్టికను నోటీసు బోర్డులో డిస్‌ప్లే చేయాలని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బ భారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలని అనవసరంగా బయటకు వెళ్లకూడదని, దూర ప్రయాణాలు చేయకూడదని సూచించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. డీఎంహెచ్ఓ వెంట సీసీ డానియల్ ఉన్నారు.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పీహెచ్‌సీలలోని ఫార్మసిస్టులతో గురువారం డీఎంహెచ్ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలోని స్టాక్ అండ్ పంపిణీ వివరాలను రిజిస్టర్‌లలో ఎప్పటికపుడు నమోదు చేసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ వినోద్‌బాబ్జి, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజని, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

పానీపాట్లు!

- ముున్సిపాలిటీల్లో వేధిస్తున్న తాగునీటి కొరత
- అందని మిషన్ భగీరథ నీళ్లు
- ట్యాంకర్ల ద్వారా కాలనీలకు సరఫరా
- ప్రజలకు తప్పని కష్టాలు
- ముందస్తు చర్యలపై అధికారుల దృష్టి

ఎండలు దంచికొడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య భయపెడుతోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటింటికీ నల్లా నీరు చేరడం లేదు. పైపులైన్లు లీకేజీ, ధ్వంసం వంటి కారణాలతో నీళ్లు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎప్పటిలాగే బోరు బావులు, వ్యవసాయ బావుల వద్దకు బిందెలు పట్టుకొని పరుగులు తీస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మున్ముందు ఇంకెంత దారుణంగా ఉంటుందోనని జనం భయపడుతున్నారు.

రోజు విడిచి రోజు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో 20 వార్డులకు గాను 7,227 నల్లా కనెక్షన్ల ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. కరీంనగర్ మానేర్ డ్యామ్ నుంచి పైపులైన్ ద్వారా మహ్మదాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సంపులో నీటిని నింపుతున్నారు. అక్కడి నుంచి హుస్నాబాద్ పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తుండడంతో తాగడానికి కూడా సరిపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో బోర్లు లేక కేవలం నల్లా కనెక్షన్ల పైనే ఆధారపడుతున్న వారికి నీటి ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని వార్డుల్లో దేవతల బావి నుంచి పైపు లైన్ల ద్వారా మినీ ట్యాంకులను నింపుతున్నారు. దీంతో తెల్లవారు జామునుంచే బిందెలతో క్యూ కడుతున్నారు.



పట్టణంలోని శివాలయం వీధిలో మినీ ట్యాంక్ వద్ద నీళ్ల కోసం కాలనీ వాసుల నిరీక్షణ

పలు కాలనీల్లో నీటి ఇబ్బందులు...

హుస్నాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీళ్లు పలు కారణాలతో నిలిపివేస్తున్నారు. బస్ డిపో వెనుక కాలనీ, నేతాజీ కాలనీల్లో మిషన్ భగీరథ నీళ్లు బంద్ అయ్యాయి. వారం రోజుల పాటు మిషన్ భగీరథ నీటిని నిలిపివేశారు. అలాగే సబ్ స్టేషన్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన జీఆర్ కాలనీలో ఇంత వరకు మిషన్ భగీరథ నీటి పైపు లైన్లు వేయలేదు. జాతీయ రహదారి పనుల నిమిత్తం నీటి పైపు లైన్లు తొలగించడంతో కోర్టు కాలనీలో దాదాపు 15 రోజుల నుంచి మిషన్ భగీరథ నీటిని నిలిపివేశారు.

నీళ్లు సరిపోవడం లేదు



మాకు బోర్లు లేవు. నల్లా కనెక్షన్ల పైనే ఆధారపడ్డాం. మిషన్ భగీరథ నీటిని రోజు తప్పించి రోజు విడుదల చేస్తున్నారు. కొద్దిసేపు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీళ్లు తాగడానికి కూడా సరిపోవడం లేదు. కాలనీలోని మినీ ట్యాంక్‌ల వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇక్కడ కూడా పది మంది పట్టుకోవడం తోనే నీళ్లు అయిపోతున్నాయి.

– లక్ష్మి, శివాలయం వీధి, హుస్నాబాద్

పొదుపుగా వాడుకోవాలి



హుస్నాబాద్ పట్టణంలో ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీటిని రోజు విడిచి రోజు విడుదల చేస్తున్నాం. వేసవిలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది కాబట్టి తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి. నీటిని వృథా చేస్తే జరిమానాలు విధిస్తాం. అవసరాన్ని బట్టి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్



దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో బిందెలతో మహిళలు

నీళ్ల కష్టాలు 'డబుల్'

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మిషన్ భగీరథ నీళ్లు సరిపడా రాకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 3వ అంతస్తులోకి కనీసం 2 బిందెల నీరు కూడా రాకపోడంతో కింద నుంచి నీళ్లు ఎత్తుకెళ్లాలంటే అవస్థ పడుతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద 150కే వాటర్ ట్యాంకర్‌ను నిర్మించారు. ఎండ తీవ్రతతో బోరు నీళ్లు తగ్గి ట్యాంక్ నిండకపోవడంతో నీటి సమస్య వస్తుందని అధికారులంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రజలు నీటి కోసం పడుతున్న సమస్యను ఉన్నతాధికారులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం.

–రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ , దుబ్బాక

3 అంతస్తులు ఎక్కలేకపోతున్నా



కింది నుంచి 3 అంతస్తులకు 40 మెట్లు ఎక్కి నీరు తీసుకోవాలంటే కష్టంగా ఉంది. రోజూ వచ్చే నీళ్లు కనీసం అవసరాలకు కూడా సరిపోవడం లేదు. నా వయస్సు 72 ఏళ్లు. భర్త మంచాన పడ్డాడు. గుక్కెడు నీళ్ల కోసం అష్ట కష్టాలు పడాల్సి వస్తుంది.

– గంగిశెట్టి అంబవ్వ, వృద్ధురాలు

మా కష్టం సూడుర్రి



పెద్దసార్లు మేము డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నీళ్ల కోసం పడుతున్న కష్టాలు జర సూడుర్రి. రోజు వచ్చే అర్ధగంట నీళ్లు కనీసం 2 బిందెలు కూడా నిండడం లేదు. జర సమస్యను పట్టించుకొని నీళ్లను వదులండి.

– గుండ్ల జనాబాయ్, డబుల్ బెడ్‌రూం వాసి

నిత్యం నీటి కటకట

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో వేసవి కాలం ప్రారంభంలోనే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి, పడాల్‌పల్లి, వెంకటాపూర్(పీటీ), రావెల్లి, అల్లాపూర్ గ్రామాలు ఉన్నాయి. మొత్తం జనాభా 30 వేలకు పైగా ఉంటుంది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. మున్సిపల్ పరిధిలో 5,883 నల్లా కనెక్షన్లు, 25 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. అయితే కేవలం పట్టణంలో ఇంటింటా రెండుపూటల నల్లాల ద్వారా నీటిని వదులుతున్నారు. పట్టణ జనాభాకు నిత్యం 3.2 ఎంఎల్‌డీ నీటి అవసరం కాగా, అంతే నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా నీరు వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే డబుల్ బెడ్రూంల వద్ద నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



నల్లాల వద్ద నీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. సరిపడా నీళ్లు రాక నానా అవస్థలు తప్పడం లేదు. పలుమార్లు నాయకులకు చెప్పిన ఎవరు మా సమస్య పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

–మన్నె లావణ్య, వెంకటాపూర్(పీటీ)

నీరు రావడం లేదు



ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని వదులుతున్నారు. కానీ నీళ్లు వస్తలేవు. అందరు నల్లాలకు మోటర్లు బిగిస్తుండ్రు. దీంతో నీళ్లు రావడం లేదు. వచ్చిన కొన్ని నీళ్లు సరిపోవడం లేదు. ఎండాకాలం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి ఉంటది. అధికారులు పట్టించుకొని నీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

–తలారి భారతీ, వెంకటాపూర్(పీటీ)

ముందస్తు చర్యలు..

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులున్నాయి. ఇవి కాకుండా మల్లన్నసాగర్ నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కూడా ఉంది. మున్సిపాలిటీ పరిధిలో 10 వేల వరకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మరో 5 వేల వరకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పట్టణ అవసరాల కోసం నిత్యం 7.25 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) మిషన్ భగీరథ నీటిని వాడుకుంటున్నారు. ప్రజ్ఞాపూర్ వద్ద ఉన్న హెచ్ఎండబ్ల్యూఎస్ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్) పైప్‌లైన్ నుంచి నీటిని ట్యాపింగ్ చేసి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రం కావడంతో మంచినీటి సమస్య రాకుండా మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. 20 వార్డుల్లోని 40 బోరుబావులను మున్సిపల్ యంత్రాంగం మరమ్మతు చేయించి సిద్ధంగా ఉంచుకోవాలని నిర్ణయించింది. ఒకవేళ మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తే వెంటనే ఈ బోరుబావుల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నింపి మంచినీటి సరఫరాను యథాతథంగా కొనసాగించే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతానికి మంచినీటి ఇబ్బందులు లేవన్నారు.



గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీలో పాత బోరును రిపేరు చేస్తూ..

కొత్త కాలనీల్లో తప్పని తిప్పలు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో గల విలీన వార్డుల పరిధిలో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో వేసవిలో నీటి తిప్పలు తప్పడం లేదు. పాత పట్టణం కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ) ద్వారా మున్సిపాలిటీకి ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. మరోవైపు మిషన్ భగీరథ ద్వారా (మల్లన్న సాగర్ రిజర్వాయర్) పట్టణంలో ఇంటింటికీ నీరు సరఫరా జరుగుతుంది. సమీపంలోని ఆరు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం, పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పెద్ద ఎత్తున నూతన కాలనీలు వెలుస్తున్నాయి. దీంతో కొత్త కాలనీల్లో పైపు లైన్ ఏర్పాటు చేయక నీటి సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా లింగారెడ్డి పల్లి సమీపంలో వడ్డెర కాలనీ, రంగదాంపల్లి శివార్లలో, కిష్టసాగర్ రోడ్డు మార్గంలో, ఎల్లంకి కళాశాల సమీపం, మచ్చవాని కుంట సమీపం, ఎన్జీవో కాలనీ శివారు, మహిళా డిగ్రీ కళాశాల నందన వనం కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది. పాత పట్టణానికి అనుసంధానంగా వెలిసిన విలీన వార్డుల్లోని కొత్త కాలనీలో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ఇటీవల బల్దియా రూ 2.50 కోట్లతో సుమారు 27 కిలోమీటర్ల నూతన పైపు లైన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసింది.



పట్టణానికి శివార్లలో మహిళా డిగ్రీ కళాశాల వద్ద ఏర్పడిన నూతన కాలనీ నందన వనం

సరఫరాలో వ్యత్యాసం

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి ఎద్దడి సమస్య అంతగా లేకపోయినా సరఫరాలో వ్యత్యాసం ఉంది. దీంతో కొన్ని ఇళ్లకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పట్టణంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఈ వేసవిలో ఇప్పటి వరకు నీటి ఎద్దడి సమస్య తలెత్తలేదు. మున్సిపాలిటీ పరిధిలో 23 వేల మంది జనాభాకు ప్రతిరోజూ 31 లక్షల పైచిలుకు లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. 19 రక్షిత నీటి సరఫరా ట్యాంకులకు ప్రతిరోజూ భగీరథకు సంబంధించి 15 లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతుండగా, పట్టణంలోని సింగిల్ ఫేజ్, ఐదు హెచ్‌పీ మోటార్ల ద్వారా మరో 15 లక్షల లీటర్ల మేర తాగు నీరు వస్తుంది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెండు పడకల ఇళ్ల వద్ద నాలుగైదు నెలలుగా నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులపాలయ్యారు. రెండు రోజుల కిందట మున్సిపల్ చైర్మన్ ప్రత్యేకంగా పైపులైన్ వేయించి కాలనీలోని రెండు బోర్లకు కనెక్షన్ ఇప్పించారు. దీనితో సమస్య తీరిపోయింది.



రామాయంపేటలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో వేస్తున్న పైపులైన్

పైపులైన్లు ధ్వంసం

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారి వెంబడి జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా సైడ్ కాల్వ నిర్మాణం కోసం కాల్వలు తీస్తున్న క్రమంలో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైంది. దీంతో పలు కాలనీల్లో తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవి కాలం కావడం తాగు నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి మున్సిపల్ అధికారులు హరితహారం మొక్కలకు నీరు పోసే ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తూ కంటి తుడుపు చర్యలు చేపడుతున్నారు. సదరు రోడ్డు పనుల కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టి ఎప్పటికప్పుడూ ధ్వంసమైన పైపులైన్లను మరమ్మతు చేస్తే నీటి సమస్య ఉండదని పట్టణ వాసులు వాపోతున్నారు.



ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

పట్టణ పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మిషన్ భగీరథ పైపు లైన్లు ధ్వంసం కావడంతో తాగు నీటి సమస్య తలెత్తుతుందన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన కలెక్టర్ సమస్య పునరావృతం కాకుండా చూడాలని జాతీయ రహదారి విస్తరణ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు.

–నర్సయ్య, ఇన్‌చార్జి కమిషనర్

కొత్త కాలనీల్లోనే సమస్యలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లోని కొత్త కాలనీల్లో నీటి సరఫరా సరిగా లేదు. అమీన్‌పూర్ పట్టణానికి ప్రతీ రోజు 16 మిలియన్ లీటర్లు సరఫరా కావాలి. కానీ సరఫరా చేస్తుంది 12 మిలియన్ లీటర్లే మాత్రమే. పట్టణంలో కొత్తగా వచ్చిన కాలనీలో పైపులైన్‌లు లేవు. అక్కడ వెలుస్తున్న అపార్ట్‌మెంట్ వారు సొంతంగా బోర్లు వేసుకొని నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. అమీన్‌పూర్ పట్టణంలో రెండు రిజర్వాయర్లు, పటేల్‌గూడాలో ఒక రిజర్వాయర్ నిర్మాణంలో ఉంది. అమీన్‌పూర్‌లో 18,405 వాటర్ టాప్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతానికి నీటి సరఫరా వ్యవస్థ అమీన్‌పూర్ ప్రజల దాహార్తి నివారణకు తగిన విధంగా రూపుదిద్దుకోలేదని చెప్పాలి. అయితే, నీటి కొరత లేదని మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు. ప్రజలు నీటి కోసం ఖాళీ బిందెలు పట్టుకొని తిరగాల్సిన పరిస్థితి లేదు. మిషన్ భగీరథ పథకం అమీన్‌పూర్‌లో నీటి సమస్యకు పరిష్కారం చూపింది. అయితే ఇంకా భగీరథ పనులు పూర్తి కాలేదు. రిజర్వాయర్ల నిర్మాణం కొనసాగుతూనే ఉంది.



లాలాబాయి కాలనీలో నిర్మాణంలో ఉన్న ఈఎల్ఎస్ రిజర్వాయర్

'బోరు'మంటున్నారు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 50 వేల వరకు జనాభా, 22 వార్డులు ఉంటాయి. ఈ వార్డుల్లో ప్రతీ నిత్యం 2 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుంది. మున్సిపల్ పరిధిలో పది వేల వరకు బోర్లు ఉంటాయి. నెల రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉండటంతో 50 శాతం వరకు బోర్లు ఎండిపోయాయి. దీంతో నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కేవలం మూడు ట్యాంకర్ల ద్వారా నామమాత్రంగా నీటిని అందిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. సమస్యను ఎవరితో చెప్పుకోవాలో తెలియని స్థితిలో మున్సిపల్ ప్రజలు ఉన్నారు.



గాంధీ నగర్‌లో నీటి కోసం గుమిగూడిన మహిళలు

వారం రోజులకోసారి..

వారం రోజులకోసారి నల్లాల ద్వారా నీరు వస్తుంది. ఈ నీరు కూడా సరిపడా రావడం లేదు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మి, గాంధీనగర్, బొల్లారం

చర్యలు చేపడుతున్నాం

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం అవసరం ఉన్న మేరకు నీటి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నాం. ప్రజలు కూడా నీటి వినియోగాన్ని తగ్గించాలి. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు సమాచారం అందించాలి.

– మంగతయారు, మున్సిపల్ కమిషనర్ బొల్లారం

సింగూర్ నుంచి 56 లక్షల లీటర్లు



సదాశివపేట పట్టణంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపల్ పరిధిలోని 26 వార్డుల్లో తాగునీటి సమస్యలు లేవు. పట్టణ పరిధిలో సుమారు 126 కిలో మీటర్ల వరకు మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతుంది. సింగూర్ ప్రాజెక్ట్ నుంచి మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా సదాశివపేట పట్టణానికి వేసవి కంటే ముందు 44 లక్షల లీటర్ల తాగునీటి సరఫరా కాగా ప్రస్తుతం 56 లక్షల లీటర్లు సరఫరా అవుతుంది. అన్ని వార్డుల్లో రోజు విడిచి రోజు సుమారు గంట సేపు తాగునీరు సరఫరా అవుతుంది. సదాశివపేట పట్టణంలోని 9,850 ఇంటి నంబర్ల పక్కా గృహాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కనెక్షన్లు ఇచ్చారు. పట్టణ పరిధిలో 181 బోర్లకుగాను 175 బోర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. భగీరథ పైపులైన్ పగిలిపోవడం, లీకేజీల కారణంగా తాగునీటి సమస్యలు అత్యవసరంగా ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి చెందిన రెండు ట్యాంకర్లు, 2 ప్రైవేట్, ట్యాంకర్లు అత్యవసరమనుకుంటే మరో రెండు ట్యాంకర్లను అద్దెకు తీసుకొని తాగునీటిని సరఫరా చేస్తామని ఇంజనీర్ రాజేశ్ తెలిపారు.

తాగు నీటికి తండ్లాట

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో 32 వార్డులు ఉండగా, అన్ని వార్డులకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. సింగూర్ నుంచి వచ్చే నీటిని పట్టణంలోని ఖిల్లాపై స్టోర్‌చేసి అక్కడి నుంచి అన్ని వార్డులకు సరఫరా చేస్తారు. తరుచూ లీకేజీలతో నీటి సమస్య ఉత్పన్నం అవుతుంది. గతంలో పట్టణంలోని వార్డుల్లో నీటి సరఫరా కోసం సింగిల్ ఫేజ్ మోటార్లతో కూడిన బోర్లు ఉండేవి. మిషన్ భగీరథ వచ్చినప్పటి నుంచి వార్డులోని బోర్లకు ఉన్న మోటార్లు తొలగించారు. ఫలితంగా సరిపడా నీటి సరఫరా జరడం లేదన్న ఆరోపణలున్నాయి. పట్టణ శివారులోని పిల్లికోటల్ వద్ద గల డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇంకా మిషన్ భగీరథ నీటి సరఫరా అంతటా జరగడం లేదు.



డబుల్‌బెడ్ రూం ఇళ్ల ఎదుట డ్రమ్ములు

ఎండలు మరింత ముదిరితే..

గతంలో మిషన్ భగీరథ ద్వారా గంటపాటు నీళ్లు వచ్చేవి. ప్రస్తుతం అరగంట మాత్రమే నీళ్లు వదులుతున్నారు. అవి కూడా అంతంత మాత్రమే వస్తున్నాయి. దీంతో నీళ్లు సరిపడక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు మరింత ముదిరితే నీళ్ల కోసం ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో.

– భూలక్ష్మి, నవాబుపేట వీధి, మెదక్ పట్టణం

ప్రణాళికతో సిద్ధంగా ఉన్నాం

పట్టణ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో సిద్ధంగా ఉన్నాము. ప్రస్తుతం పట్టణానికి సింగూర్ నుంచి నీరు వస్తుంది. నీటి సమస్య లేదు. ఎప్పుడైనా సమస్య ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. అన్ని వార్డుల్లో సింగిల్ ఫేస్ మోటార్లు అందుబాటులో ఉన్నాయి.

– మహేశ్, మున్సిపల్ డీఈ

బోరు నీళ్లే దిక్కు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీవాసులకు తాగడానికి మామూలు బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. మిషన్ భగీరథ పథకం కాంట్రాక్టర్ పట్టణంలోని పలు కాలనీల్లో పైపులైన్ పూర్తి స్థాయిలో వేయకపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. పట్టణంలోని ఐదవ వార్డులో కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా నీళ్లు సన్నగా రావడంతో బోరు బావులపై ఆధారపడుతున్నారు. అలాగే వేంకటేశ్వర కాలనీలో పైపులైను లేకపోవడంతో భగీరథ నీళ్లు రావడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాగా, రెండవ వార్డు పరిధిలోని ఎన్జీవోస్ కాలనీకి పీర్ల గుట్ట పై ఉన్న నీటి ట్యాంకు నుంచి భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నారు. ట్యాంకు నుంచి నీటి సరఫరా నిర్వహణ సక్రమంగా లేనందున కాలనీలోని కమ్యునిటీ హాలు ఏరియాలోని ఇళ్లకు భగీరథ నీళ్లు రావడం లేదు. నీళ్ల సరఫరాకు సమయపాలన లేదని, ఎప్పుడు వస్తాయో ఎంత సేపు వస్తాయో తెలియదని, దీంతో తామంతా కాలనీలోని సాధారణ బోర్ల నీళ్లు వాడుకుంటామని కాలనీ వాసులు తెలిపారు.



ఎన్జీఓస్ కాలనీలో ప్రజల దాహం తీరుస్తున్న బోరు

నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలీదు



తమ ఏరియాలో భగీరథ నల్లాల నుంచి నీళ్లు సన్నగా వస్తాయి. వచ్చిన నీళ్లు ఎప్పుడు వస్తాయి.. ఎంత సేపు వస్తాయో తెలియడం లేదు. నల్లాల నుంచి నీళ్లు సన్నగా వస్తున్నాయని అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు. తమ కాలనీలోని బోర్ల నీళ్లను వాడుకుంటాం.

– సరోజనమ్మ, ఎన్జీఓస్ కాలనీ కమ్యూనిటీ ఏరియా నివాసి

క్రైం కార్నర్

యువకుడిపై కత్తులతో దాడి

పాత కక్షల నేపథ్యంలో హత్యాయత్నం

కొండపాక(గజ్వేల్): పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై కత్తులతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కొండపాకలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొండపాకలోని వడ్డెర కులానికి చెందిన రేపాక పరశురాములు, రేపాక హనుమంతు కుటుంబీకుల మధ్య ఏడాది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. హనుమంతు కోడలుతో పరశురాములు పెద్ద కుమారుడు చందు (26)వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో అప్పట్లో పెద్ద ఎత్తున గొడవ జరిగింది. దీంతో హనుమంతు కుటుంబీకులు సిద్దిపేటకు మకాం మార్చారు. అయినా చందు హనుమంతు నివాసం ఉండే ప్రాంతంలో తిరుగుతుండటంతో ఎలాగైలా అతడిని చంపాలని నిర్ణయించుకున్నారు. మూడు రోజులుగా హనుమంతు కుమారులు సంతు, నవీన్ కొండపాకలో ఉంటూ సమయం కోసం వేచి చూస్తున్నారు. గురువారం ఉదయం చందు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి సమీపంలోని బతుకమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. దీన్ని గమనించిన సంతు, నవీన్ కత్తులతో వెళ్లి అతి కిరాతకంగా చందుపై దాడి చేశారు. వెంటనే చందు విషయాన్ని తమ్ముడు నరేందర్‌కు ఫోన్ చేసి చెప్పగా, సంతు, నవీన్ పరారయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న నరేందర్ రక్తపు మడుగులో ఉన్న అన్నను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి తమ్ముడు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. నిందితులు సంతు, నవీన్‌లు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో..

యువకుడి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ప్రేమ విఫలమైందని జీవితంపై విరక్తితో వర్గల్ మండలం నెంటూరులో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బేగంపేట ఎస్సై భుజంగరావు తెలిపిన వివరాల ప్రకారం నెంటూరుకు చెందిన చీరాల యాదయ్య–నాగమ్మ దంపతుల చిన్న కుమారుడు రమేశ్ (24) ప్లంబర్ పనిచేస్తుంటాడు. బుధవారం సాయంత్రం పాత ఇంటి వద్ద స్నానం చేసి వస్తానని కుటుంబీకులకు చెప్పి వెళ్లాడు. స్నానానికి వెళ్లిన కొడుకు ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లి నాగమ్మ పాత ఇంటికొచ్చి చూసింది. కుమారుడు దూలానికి ఉరి వేసుకొని కనిపించాడు. ప్రేమ ఫలించలేదని జీవితంపై విరక్తితో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.